


**నా చుట్టూ ఉన్న ప్రపంచం నాకెన్నో కథలు చెబుతూంటుంది**

వాటిలో రకరకాల అనుభూతులుంటాయి. ఆ అనుభూతులకు అక్షర రూపాన్నివ్వాలన్నది నా సరదా. అలా ఇవ్వలేకపోతున్నానన్నది నా ఆవేదన.

నాలోని కథా శక్తిని నేను కాలేజీలో చదువుతున్నప్పుడు గుర్తించాను. నాలుగు గేయాలు, రెండు కథలు నావి పత్రికలలో ప్రచురించబడ్డాయి. అప్పుడు నాన్న నన్ను పిలిచి- "ఇది చాలా చెడ్డ వ్యసనం. దీనివల్ల చెడిపోయిన వారే తప్ప బాగుపడ్డవారు లేరు-" అని నాకు చెప్పాడు. నేను రచనలు చేయడాన్నాయన తీవ్రంగా నిరసించడంతో నాకింక మానేయక తప్పలేదు.

నా కాలేజీ చదువు పూర్తికాగానే నాన్న నడివయసులో అర్థాంతరంగా చచ్చిపోయాడు. ఇంటి బాధ్యతలన్నీ నామీద పడ్డాయి. ఇంటికి నేనే పెద్దవాణ్ణి. నాకు ముగ్గురు చెల్లెళ్లు. మాకు ఓ బట్టల దుకాణం, ఫ్యాన్సీ దుకాణం ఉన్నాయి. డబ్బుకేమీ లోటులేదు. కానీ ఇటు వ్యాపారం పనులు, అటు ఇంటి పనులు- క్షణం తీరుబడి లేదు.

నా మనసు రచనలు చేయమని గొడవ పెడుతూండేది. అప్పుడు నాన్న నన్ను ఆపాడు. ఇప్పుడు బాధ్యతలు నన్నాపు తున్నాయి

ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళి చేశాక నా పెళ్ళి అయింది ఆ తర్వాత రెండు సంవత్సరాలకు మూడో చెల్లెలి పెళ్ళి కూడా చేశాను ఇంక నా జీవితం నాకు మిగిలింది అప్పుడైనా కథ వ్రాయడం మొదలెట్టాలను కున్నాను అప్పటికి శ్రీమతి విజృంభించింది.

ఆమెకు చాలా సరదాలున్నాయి అవన్నీ నా ద్వారానే తీర్చుకోవాలని అనుకుంటోందామె ఆమె కోరిక ప్రకారం మేమిద్దరం ఊటీలు, కాశ్మీ రాలూ తిరిగాం ఆమె కోసం పట్టు చీరలు, నగలు వగైరాలకు చాలా ఖర్చు చేశాను.

వ్యాపారంలో నేను సమర్థుడిని కాదు ఆపైన ముగ్గురి చెల్లెళ్ళ పెళ్ళి బాధ్యత, లాభాలు తగ్గడం మూలా అటుంచి బట్టల షాపులో చాలా నష్టం వచ్చింది నా మీద జాలితోనూ, నాన్న మీద విశ్వాసంతోనూ మేనేజరు ఆ నష్టాన్నంతా తానొక్కడే భరించి, బట్టల షాపును తన స్వంతం చేసు కున్నాడు.

నాకు ఫ్యాన్సీ షాపొక్కటే మిగిలింది. పెద్దైన నాలుగేళ్ళకు

"ఇదైనా కాస్త తెలివిగా చేయండి" అంది శ్రీమతి.

ఆమెకు నామీద చాలా కోపంగా ఉండే నా కారణంగా ఆమె హోదా తగ్గిపోయింది సదుపాయాలు తగ్గి పోయాయి ఇంట్లో ఇదివరకు ముగ్గురు పనివాళ్ళుండేవారు ఇప్పుడు ఒక్కడే!

ఆ పైన నాకు పిల్లలు పుట్టుకొస్తు న్నారు

ఎప్పుడైనా రాతకు కూర్చుందా మంటే శ్రీమతి విరుచుకుని పడేది. ఉన్న షాపుని ఎలా అభివృద్ధి చేయాలీ అన్నది ఆలోచించాలిట అస్తమానూ!

నాకు ప్రజల సమస్యల గురించి, రాజకీయాల గురించి ఆలోచించాలని ఉంటుంది.

తరచు మా యింటికి నా బావమరు దులు వచ్చి వ్యాపారాన్నెలా అభివృద్ధి చేసుకోవాలో ఉపన్యాసమిచ్చి వెడు తూండేవారు. విన్నప్పుడంతా బాగానే ఉండేది కానీ తర్వాత అంతా అయో మయంగా ఉండేది

నా తెలివి తేటలెలా ఉన్నాయంటే ఫ్యాన్సీ దుకాణముండీ కూడా నా పిల్లల పాలడబ్బాల కిబ్బంది పడాల్సి వచ్చేది వచ్చిన కోటాలోంచి డబ్బాలను ఎలా

బ్లాక్ చేయాలో బావమరుదులు చెప్పే వారు. కోటాలించి నా వాటా తప్ప- అవసరమైన డబ్బాలెలా తీసుకోవాలో నాకు తెలిసేది కాదు.

అయినప్పటికీ ఈ నా వ్యాపారం నష్టంమీద నడవడం లేదు. ఆదాయం నెలకు రెండువేలు. కానీ సాటివారిలో తక్కువగా ఉంటున్నానని శ్రీమతి బాధ!

ముగ్గురు పిల్లలు నాకు అబ్బాయి- అమ్మాయి-అబ్బాయి వాళ్ళ చదువులు డొనేషన్లు టెక్స్టు పుస్తకాలు దొరక్క- పోవడం హోంవర్కులు, వాళ్ళకు స్కూల్లో పాఠాలు సరిగ్గా చెప్పరు. అన్నీ నా బాధ్యతలే!

పెళ్లెందుకు చేసుకున్నానా అని చాలా సార్లు అనిపించేది. కానీ గత జలసేతు బంధనం.

రోజురోజుకీ యింట్లో పోరు ఎక్కువై పోతోంది. ఆడపిల్లకు బంగా రం చేయించాలట- ఏటా అయిదు తులాలు. మగపిల్లలకు, ఆడపిల్లలకు నెలకు రెండుసార్లేనా కొత్త బట్టలు. ఆమెకు చాలా సరదాలున్నాయి ...

నా శక్తి చాలదని తెలిసీ నన్ను సతాయిస్తూంటుంది

ఆఖరికి విసిగిపోయి నాకు చేతకాని పని ప్రారంభించాను. సరుకులన్నీ బ్లాకు చేయడం.

చేతకాని పని చేస్తే ఏమవుతుంది?

పోలీసులకు కేసులు కావాలి. వాళ్ళు నాబోటి వారికోసం వెతుకుతూంటారు. నామీద నేరం ఆరోపించబడింది.

అయిదువేలు జరిమానా కాని, ఆరు నెలల జైలుశిక్ష గానీ అనుభవించా లన్నారు. ఎవరెన్ని చెప్పినా నేను విన లేదు. ఆ డబ్బుతో కూతురికి బంగారం చేయించమని చెప్పి నేను జైలుకు వెళ్ళాను.

జైల్లో ఒంటరితనం. నాకెవ్వరూ లేరక్కడ

రోజూ అలవాటైన వాతావరణానికి- దీనికీ చాలా పెద్ద మార్పు.

నేను జైల్లో ఉన్న నెలరోజుల్లో నా భార్య నా దగ్గరకు నాలుగుసార్లు వచ్చింది నేను లేకపోతే తోచడం లేదంది.

"మరి- మీ కందరికీ ఎలా గడుస్తోంది? అనడిగాను."

శ్రీమతి షాపు వ్యవహారాలు తనే స్వయంగా చూసుకుంటోందిట వస్తువుల ధరలను నిర్ణయించడంలోనూ, వస్తువు లెక్కించి కొనితేవాలన్నది తెలుసుకోవడంలోనూ నా వల్ల చాలా అవకతవకలు జరిగాయట. చాలావాటికి

రలు తక్కువగా ఉన్నాయట. అవి తర దుకాణాలవారు నా దగ్గర కొని ళ్ళీ హెచ్చుదరకు అమ్ముకుంటున్నా ట. నేను చాలా వస్తువులు హెచ్చు రలకు కొంటున్నానట. వారం జుల్లో శ్రీమతి ఈలోపాన్ని గుర్తించ నికి నా బావమరిది సహాయపడ్డాడట ప్పుడు షాపు బ్రహ్మాండంగా నడు స్తున్నదిట.

రెండో నెలలో శ్రీమతి నన్ను హాడ్డానికి రెండుసార్లు మాత్రమే చ్చింది పనులెక్కువగా ఉంటున్నా యని చెప్పిందామె.

మూడో నెలలో ఆమె నన్ను చూడ్డా కి ఒక్కసారి కూడా రాలేదు నాలుగో నెలలో ఒక్కసారి మాత్రం వచ్చి- 'ఇంక పరవాలేదండీ- నాకిప్పుడు వ్యాపారం గురించి చాలా తెలిసింది. ఇలాగే నడిచిపోతే మనం మళ్ళీ మూ ట్టల దుకాణం కూడా పెట్టుకోవచ్చు-" అంది

"నువ్వు చాలా తెలివైన దానివి-" అన్నాను

ఆమె సంతోషించింది - "మీరూ తెలివైన వారే-కానీ మీరు వ్యాపారానికి నికిరారు. ఈ సంగతి నేనెప్పుడో గ్రహించవలసింది. మూడు వారాల్లో నాకు తెలిసిన మెలకువలు- పదేళ్లుగా వ్యాపారం చేస్తూ కూడా మీరు తెలుసు కోలేకపోతున్నారు-"

నేను ఒప్పుకున్నాను.

"మీరింక బెంగ పెట్టుకోకండి. వ్యాపార బాధ్యతలు మీతో పాటు నేనూ సమంగా పంచుకుంటాను. మీకు శ్రమ తగ్గుతుంది-" అంది శ్రీమతి.

నాకు చాలా సంతోషం కలిగింది. నాకు జైలుశిక్ష పడడం నా మంచికే జరిగింది ఇప్పుడు నా బాధ్యతలు బాగా తగ్గుతాయి సరుకు ఎక్కడ్నించి తేవాలో శ్రీమతి నిర్ణయిస్తుంది. సరుకు ఏ ధర నిర్ణయించాలో శ్రీమతి చెబుతుంది నాకు శరీరకంగానూ, మానసికంగానూ చాలా శ్రమ తగ్గుతుంది.

పనులు చూడటానికి శ్రీమతి ఓ మనిషిని కూడా నియమించిందిట- "వ్యాపారం బాగా నడుస్తున్నప్పుడు మనం అట్టే శ్రమ పడకూడదు" అందామె నాకు వ్యాపార రహస్యాలను బోధిస్తూ.

ఇది విని నేను ఇంకా సంతోషించాను. దుకాణం పనులు చూడడానికి వేరే మనిషి ఉన్నాడు. శ్రీమతి కూడా వ్యాపారం పనులు చూడడం ప్రారంభించింది ఇంక నా శ్రమ చాలావరకు తగ్గిపోయినట్లే

ఆరు నెలల అనంతరం నేను జైలు నుంచి విడుదలై ఇల్లు చేరాను. జైలుకు

వెళ్ళి వచ్చానని నాకేమీ సిగ్గుగా అని పించడం లేదు నేను యధాప్రకారం గానే ఉన్నాను.

ఓ నాలుగు రోజులు ఇంట్లో నన్ను ప్రత్యేకంగా చూసింది శ్రీమతి ఆ తర్వాత మళ్ళీ మామూలు కథ ప్రారంభ మైంది.

"అసలే జైలుకి వెళ్ళి వచ్చారు మరింత డబ్బు సంపాదిస్తే తప్ప మన పరువు నిలబడదు-" అన్న మూల మాత్రం ఆధారంగా నన్నామె సతాయి స్తోంది.

శ్రీమతికి వ్యాపారంలో మెలకువలు తెలిశాయి. ఇంక నన్నామె ఊరికే కూర్చోనివ్వదు సంపాదన పెరిగితే అది అనుభవించడం కాదు - వ్యాపా రాన్ని పెంచాలి అదీ ఆమె నాకు చెబు తున్నది.

ఈ జీవితంలో నాకు తీరుబడి దొర కదు. ఈ బాధ్యతలు నా గొంతులో ఊపిరి ఉన్నంత కాలం నన్ను విడ నాడవు

నేను మళ్ళీ బట్టల దుకాణం తెరిచే ప్రయత్నం చేస్తున్నాను మా వీధిలో అమ్మకానికి వచ్చిన స్థలం సంపా దించాలని చూస్తున్నాను. నా బావమరిది మా ఊళ్లో పెట్టబోయే హోటల్లో వాటా దారును కాబోతున్నాను. ఇది అనంతం.

నాకు తీరుబడి మాట అటుంచి రాత్రిళ్లు నిద్రలో కూడా వ్యాపారానికి సంబంధించిన కలలే వస్తున్నాయి

మా ఆవిడ సలహా కారణంగానేమో నాకు వ్యాపారస్థుడిగా మంచిపేరే వస్తు న్నది ఎవడో దూరపు బంధువు మా యింటికి వచ్చి - తను తయారుచేస్తున్న అగరు వత్తులకు మంచి ప్రచారం వచ్చేలా చేయమని వేధిస్తున్నాడు. కమి షన్ విషయంలో ఆయనకూ, శ్రీమతికీ బేరం జరుగుతోంది చివరికి బేరం కుదిరింది. అది నా బంధువుకు మరీ అంత తృప్తికరంగా ఉన్నట్లు లేదు. అందుకని మాటల మధ్యలో నా వంక తిరిగి "అన్నట్లు నువ్వు జైల్లో ఉన్నా వటగా" అన్నాడు

బహుశా నా లెక్కువతనాన్ని ఎత్తి చూపాలనుకున్నాడేమో।

నేను తడుముకోకుండా "అవును రెండు సంవత్సరాలనుంచి" అన్నాను.

నేను జైల్లోంచి విడుదలై రెండు సంవత్సరాలే అయింది జైల్లో ఉండగా అక్కడి అధికారులు దయతో నాకు సరఫరా చేసిన కాగితాలమీద రాసుకున్న కథలు, కవితలు ఫెయిర్ చేసుకునే తీరుబడి కూడా నాకుండడం లేదు

అందుకే నాకు జైలునుంచి విడుద లయినట్లుకాక జైల్లోకి విడుదలైనట్లు అనిపిస్తూంటుంది. ★